సాక్షి తిరుపతి

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



ఎస్వీ వేద వర్సిటీలో ఆస్ట్రాలజీ కోర్సు

తిరుమల: శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆస్ట్రాలజీ, అకల్ట్ సైన్సెస్ విభాగాన్ని ప్రవేశపెట్టనున్నట్టు టీటీడీ ఈఓ తెలిపారు.

- 10లో



కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	22
చిత్తూరు	36	22
తిరుమల	37	22
గూడూరు	32	18
నగరి	37	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.28	4.44
చిత్తూరు	6.30	4.43
పుంగనూరు	6.32	4.47

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ప్రాథమిక సహకార సంఘం జిల్లా అధికారిగా ఎస్.శ్రీనివాసులురెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా నుంచి ఈయన తిరుపతి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాథమిక సహకార సంఘం అధికారులు నాగవర్తన, రవిబాబు, వెంకట్రామన్, పెంచలయ్య తదితరులు జిల్లా అధికారి శ్రీనివాసులురెడ్డికి స్వాగతం పలికారు.

'ఇంటి వద్దకే వైద్యం' చరిత్ర సృష్టిస్తుంది



డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

తిరుపతి తుడా: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ చరిత్ర సృష్టిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. రష్ ఆస్పత్రిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్యరంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేశారన్నారు. సుమారు నాలుగు వేల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. మరో అడుగు ముందుకేసి ఇంటి వద్దకే వైద్యాన్ని ప్రవేశపెట్టడం శుభపరిణామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో ఏపీ రోల్ మోడల్‌గా నిలవనుందని తెలిపారు.

ఘనంగా రాపూరమ్మ జాతర



రాపూరు: గ్రామ దేవత రాపూరమ్మ జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జాతరను నిర్వహించనున్నారు. తొలిరోజు సంప్రదాయ ప్రకారం రాపూరు గ్రామపెద్ద, గొల్ల పెద్దకాపు నివాసాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్టమట్టి తెచ్చి జాతరను ప్రారంభించారు. చాలాకాలం తరువాత జాతర జరుగుతున్న నేపథ్యంలో పట్టణవాసుల ఇళ్లు బంధువులు, స్నేహితులతో కళకళలాడాయి.

డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తూ..!

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి





వెంకటముని(ఫైల్), ప్రసాద్ మృతదేహం

రేణిగుంట: రేణిగుంట మండలం, జీవాగ్రం సమీపంలో పిల్లపాళెం మలుపు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం.. రేణిగుంట మండలం, ఎల్లమండ్యం పంచాయతీ, పిల్లపాళెంకు చెందిన వెంకటముని(50) ఓ బ్యాటరీ కంపెనీలో కార్మికుడు. డ్యూటీ ముగించుకుని గ్రామానికి వెళుతున్న తరుణంలో ఆయనతోపాటు రేణిగుంటలో గ్రామానికి చెందిన ప్రసాద్ తారసపడ్డాడు. ఇంటి వరకు తనకు తీసుకెళ్లాలని కోరడంతో ఇద్దరు కలిసి గ్రామానికి బయల్దేరారు. జీవాగ్రం కూడలి దాటుకుని చెన్నై హైవే నుంచి పిల్లపాళెం మలుపు వద్ద తిరుగుతుండగా, అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి కారు వీరు ప్రయాణిస్తున్న స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మళ్లీ నువ్వే రావాలి!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సమరోత్సాహం కనిపించింది. వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' నినాదం మార్మోగింది. పల్లెపట్టణం తేడాలేకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు, గృహసారథులతో హోరెత్తింది. గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించడం.. సమస్యలు తెలుసుకోవడం.. అందులో వీలున్నవాటిని అక్కడికక్కడే పరిష్కరించడం ప్రజల్లో సంతోషాన్ని నింపింది. నేతలు సైతం హోదాలు పక్కనబెట్టి పార్టీ సంచులతో కలియతిరుగుతూ గడపగడపకు వెళ్లి స్టిక్కర్లు అంటించడం అక్కచెల్లెమ్మల మోములో సంతోషం నింపింది. ఇన్నాళ్లూ తోబుట్టువుగా ఆదుకుంటున్న జగనన్న మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించడం నేతలకు సైతం ఆనందాన్నిచ్చింది.

- ఉమ్మడి జిల్లాలో అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్తు'
- ఊరూవాడా మార్మోగిన 'మా నమ్మకం నువ్వే జగన్'
- క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తల విస్తృత పర్యటన
- స్టిక్కర్లు అంటిస్తూ..సమస్యలు తెలుసుకుంటూ ముందుకు
- బాబు మోసం.. జగనన్న మంచిని బేరీజు వేసుకోవాలని సూచన



పుంగనూరు: భగత్ సింగ్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విశేష స్పందన లభించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామస్థాయిలో 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగనన్న పాలనలో అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. బాబు హయాంలో జరిగిన మోసాలనూ వివరించారు. రెండింటినీ బేరీజు వేసుకోవాలని అభ్యర్థించారు. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

- పుంగనూరులోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. చంద్రబాబు చేసిన ద్రోహం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించారు. అదేవిధంగా సీఎం సెల్‌ఫోన్‌కు స్థానికుల చేత మిస్డ్‌కాల్ చేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. 'ప్రభుత్వ పని తీరు ఎలా ఉంది?.. ఇంకా ఏం చేస్తే మంచిది' అని ప్రశ్నించి వివరాలు రాబట్టారు.
- నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం, పూడి గ్రామంలో మంత్రి ఆర్కే రోజా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.
- తిరుపతి నగరంలోని 13వ డివిజన్ ఎస్టీవీ నగర్‌లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పార్టీ బ్యాగ్ తగిలించుకుని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా నగరంలోని 50 డివిజన్లలో ఆయా కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.
- వెంకటగిరిలో తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడు నేదురమల్లి రాంకుమార్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలు, ప్రతిపక్షం చేసిన చెడును వివరించారు.
- చంద్రగిరి నియోజకవర్గం, ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయలపెంట పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు.
- సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
- గూడూరు నియోజకవర్గం, చిల్లకూరు మండలంలో ఎమ్మెల్యే వరప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ దేవసేనమ్మ పాల్గొన్నారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట పట్టణంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు.
- శ్రీకాళహస్తి మండలం, కాపుగున్నేరిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎలుగెత్తి చాటిన ఊరూవాడా

'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఓ వైపు ప్రారంభిస్తే.. మరో వైపు ఊరూరా స్థానిక నాయకులు, గృహసారథులు, వలంటీర్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. నివాసాలకు సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అంటించారు. పలువురు తమ మొబైల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించుకుని మురిసిపోయారు.



పూడిలో పర్యటిస్తున్న మంత్రి ఆర్కే రోజా



తిరుపతి : ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన



కాపుగున్నేరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



భాకరాపేట : ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మోహిత్‌రెడ్డి



వెంకటగిరి : పర్యటిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



నాయుడుపేటలో ఎమ్మెల్యే కిలివేటి పర్యటన



సత్యవేడులో బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



చిల్లకూరు : సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చురుగ్గా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

- రూ.300 కోట్లతో రీడెవలప్‌మెంట్ పనులు
- విశాలమైన పార్కింగ్
- స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ



తిరుపతి మోడల్ రైల్వేస్టేషన్

- మొదటి రెండంతస్తుల్లో కార్యాలయాలు
- మూడో అంతస్తులో విశ్రాంతి భవనం
- దక్షిణం వైపు భవనంలో పార్కింగ్, డిపార్చర్, టాయ్‌లెట్స్, క్లోక్ రూమ్
- ప్రయాణికుల కోసం 23 లిఫ్టులు, 20 ఎస్కలేటర్లు
- స్పష్టమైన సూచిక బోర్డులు
- ఉత్తరం–దక్షిణం వైపున 35 మీటర్ల వెడల్పుతో రెండు ఎయిర్ కోర్సులు

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తులు దేశవిదేశాల నుంచి వచ్చిపోతుంటారు. ఈ క్రమంలో తిరుపతి రైల్వే స్టేషన్ ఏ-1 క్లాస్ రైల్వే స్టేషన్‌గా గుర్తింపు పొందింది. ప్రయాణికుల సంఖ్యకు తగినట్లుగా వసతులు లేకపోవడంతో రైల్వే విభాగం రూ.300 కోట్లతో రీ డెవలప్‌మెంట్ పనులు చేపట్టింది. 2025 ఫిబ్రవరికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పునాది కాంక్రీట్‌తోపాటు బేస్‌మెంట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్ మీదుగా ప్రతి రోజూ 106 రైళ్లు నడుస్తున్నాయి. 80 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విజయవాడ, తిరుపతి రైల్వే స్టేషన్లు మాత్రమే ఏ-1క్లాస్ రైల్వే స్టేషన్లుగా గుర్తింపు పొందాయి. రైల్వే డివిజన్‌కు కావలసిన అన్ని సౌకర్యాలున్నప్పటికీ తిరుపతి డివిజన్‌కు నోచుకోలేదు. కనీసం ఏ క్లాస్ 1 స్టేషన్‌కు తగ్గట్టు అభివృద్ధి పనులు చేపట్టాలన్న డిమాండ్ నెలకొంది. ఈ క్రమంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని రైల్వే భావించింది. అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించింది. రైల్వే స్టేషన్‌కు దక్షిణం వైపు అత్యాధునిక సౌకర్యాలతో మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. పలు కార్యాలయాలను ఈ భవనంలోకి మార్చిన తర్వాత ఉత్తరం వైపు మరో మూడంతస్తుల భవనాన్ని నిర్మించనున్నారు. ఈ భవనాలు వంద అడుగుల వెడల్పుతో ఆరువందల అడుగుల పొడవుతో నిర్మించనున్నారు. రైల్వే స్టేషన్‌లో పనులు చేపట్టిన దృష్ట్యా స్టేషన్ మేనేజర్ కార్యాలయంతోపాటు విచారణ కేంద్రం తదితర పలు కార్యాలయాలను విశ్రాంతి హాల్ వైపునకు మార్పు చేశారు.

సకల వసతుల కల్పన



"తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రూ.కోట్లు ఖర్చు చేసి సకల వసతులు కల్పిస్తున్నాం. మరో 40 ఏళ్లకు ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాం. ఇంకో రెండేళ్లలోపు పనులు పూర్తవుతాయి. ప్రయాణికులు రైల్వే అధికారులకు సహకరించాలి.

-సత్యనారాయణ, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్

సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలి

రామచంద్రాపురం: సర్వ మానవాళి సుఖసంతోషాల కోసమే మహాయాగం నిర్వహిస్తున్నట్లు శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు, కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి తెలిపారు. రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర మహాయాగం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాతాజీ శ్రీ రమ్యానంద భారతీ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ మహాయాగంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధిశాఖ మంత్రి ఆర్కే రోజా, సీఐడీ ఎస్పీ సరిత, తిరుపతి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీ రమ్యానంద భారతీలు మంత్రి ఆర్కే రోజా, సీఐడీ ఎస్పీ సరితను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సీఐడీ ఎస్పీ సరితను శ్రీశక్తిపీఠం మేనేజింగ్ కమిటీ సభ్యురాలుగా ఎంపిక చేశారు.



మహాయాగం చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

వదిలించుకున్నావా అమ్మా!

నీ సుఖమే జీవితమని సాగావు. భాగస్వామితో ఉన్నంతకాలం సంతోష సాగరంలో తేలియాడావు. కడుపులో నలుసు పడగానే సంబరపడ్డావు. అంతకంతకూ పెరిగే కొద్దీ ఆనందపరవశ్యంతో ఉక్కిరిబిక్కిరయ్యావు. తీరా లోకాన్ని చూపించకనే అంతలోనే వదిలించుకున్నావు.. బొడ్డు కూడా కోయకుండా చీరలో చుట్టి రోడ్డున పడేశావు.. పరువు కోసం పాకులాడావో.. జీవిత భాగస్వామితో గొడవపడి దూరం చేశావో.. ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లిపోయావో తెలియదు కానీ... నన్ను రోడ్డున పడేసి వెళ్లావే అమ్మా..? అంటూ గుక్కపట్టి ఏడుస్తున్నట్టుంది కదూ ఈ మృతశిశువు.. ఏ తల్లి కన్నదో.. ఏం జరిగిందో తెలియదు కానీ ముక్కుపచ్చలారని పసికందు (మగబిడ్డ) మృతదేహం రోడ్డుపై పడేసిన ఘటన దొరవారిసత్రం మండలం, కృష్ణాపురం ఎస్టీ కాలనీకి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం వెలుగుచూసింది. పురిటి బిడ్డను కాకులు పొడుస్తూ.. కుక్కలు లాక్కుపోవడం చూపరులను కలచివేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతశిశువును పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని చూస్తుంటే అప్పుడే పుట్టిన బిడ్డను చీరలో చుట్టి రోడ్డు మీదనే వదిలివెళ్లిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి పెట్రోల్ బంకులోకి వచ్చి ఒకరి ఆరోగ్యం బాగులేదు.. అంబులెన్స్‌కు ఫోన్ చెయ్యాలంటూ సిబ్బందిని కోరినట్లు సమాచారం. ఆమేరకు సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు సేకరించి పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- దొరవారిసత్రం



కృష్ణాపురం ఎస్టీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై పురిటి బిడ్డ మృతదేహం

అమ్మవారిసేవలో ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.దర్శనానంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలుకగా, జేఈఓ వీరబ్రహ్మం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి ఇరానీ, శ్రీలంక హౌసింగ్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అరుంధిక ఫెర్నాండో, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవి కుమార్, రాష్ట్ర హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు.



రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా దంపతులు

'కొండంత' క్యూ

వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరుమల నడకదారులతోపాటు ఏటీసీ, నారాయణగిరి, గోగర్భం డ్యాం రింగ్ రోడ్డు వద్ద క్యూలు కిక్కిరిసిపోయాయి. ఎక్కడ చూసినా బారులు తీరిన క్యూలే కనిపించాయి. అద్దె గదులు దొరక్క భక్తులు ఆరు బయట సేదతీరుతున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. - తిరుమల





గోగర్భం డ్యాం రింగ్ రోడ్డు వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



విజయకుమార్ (ఫైల్)

పిచ్చాటూరు: నాగలాపురానికి చెందిన మాజీ ఎంపీపీ, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కల్పన భర్త విజయకుమార్(50) శుక్రవారం వేకువ జామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సమాచారం అందుకున్న జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ నాగలాపురంలోని మృతుని స్వగృహానికి చేరుకొని విజయ్‌కుమార్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ఓదార్చారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నాగలాపురం చేరుకొని విజయకుమార్ మృతదేహానికి గజమాలతో నివాళి అర్పించారు. మృతుని భార్య కల్పన, పిల్లలకు తన సానుభూతిని తెలియజేశారు. విజయకుమార్ పార్టీ ఆవిర్భావం నుంచి నాగలాపురంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన లేనిలోటు పార్టీకి తీర్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌ఎం సురేష్, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీ వేద వర్సిటీలో ఆస్ట్రాలజీ కోర్సు

- డయల్ యువర్ ఈవోలో ధర్మారెడ్డి



డయల్ యువర్ ఈవోలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

తిరుమల: తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆస్ట్రాలజీ, అకల్ట్ సైన్సెస్ విభాగాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : నేత్రదాన ట్రస్టును ప్రారంభించి కార్నియా దానం చేయండి. – రవి, కావలి

ఈవో : అరవింద ట్రస్టుతో ఒప్పందం చేసుకుని తిరుపతిలో నేత్ర వైద్య సేవలు అందిస్తున్నాం. వారితో చర్చించి ఐ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తాం.

ప్రశ్న : వీఐపీ సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలు కేటాయించడం తగ్గించండి. రూ.300 దర్శన టికెట్లు రెండు నెలల ముందుగానే కేటాయించండి. – శంకర్, హైదరాబాద్

ఈవో : ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం. వేసవి నేపథ్యంలో ఈ నెలలో రూ.300 దర్శన టికెట్ల కోటా తగ్గించి మార్చి నెలలో విడుదల చేశాం. ఈ నెలలో మే, జూన్ టికెట్లను విడుదల చేస్తాం.

ప్రశ్న : లక్కీడిప్‌లో ఆర్జిత సేవా టికెట్ వచ్చింది. అరగంట లేటుగా వెళ్లినందుకు టికెట్ రద్దు అయింది. గూగుల్ పే ప్రవేశపెట్టండి. నడకదారిలో టికెట్ పొందితే కొండపై లక్కీడిప్‌లో సేవలకు నమోదు చేసుకోవచ్చా. – గోవర్ధన్, జగిత్యాల

ఈవో : లక్కీడిప్‌లో సేవా టికెట్ పొందిన భక్తులు సొమ్ము చెల్లించేందుకు గూగుల్ పే, ఫోన్ పే విధానాన్ని ప్రవేశపెడతాం. నడకదారిలో దర్శన టికెట్‌కు, లక్కీడిప్‌లో సేవా టికెట్‌కు ఎలాంటి సంబంధం లేదు.

ప్రశ్న : తిరుమలకు కాలినడకన వచ్చాము. క్యూలైన్లలో ఎక్కువ దూరం నడవాల్సి వస్తోంది. – ఎర్ర మల్లయ్య, మదనపల్లి

ఈవో : ఈ నెల 1 నుంచి నడక మార్గంలో వచ్చే భక్తులకు టైమ్ స్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నాం. వీటిని పొందితే నిర్దేశిత సమయంలో స్వామిని దర్శించుకోవచ్చు. నడక మార్గాల్లో అవసరమైన చోట్ల తాగునీటి వసతి కల్పిస్తాం.

ప్రశ్న : అంగప్రదక్షిణ టోకెన్లు ఆఫ్ లైన్లో కొన్ని ఇవ్వండి. –సరితా రెడ్డి, కరీంనగర్

ఈవో : ఈ టికెట్లు పరిమితం కాబట్టి ఆఫ్‌లైన్‌లో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. భక్తుల కోరిక మేరకే ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నాం.

ప్రశ్న : శుక్రవారం నిజపాద దర్శనం సేవను పునరుద్ధరించండి.– జగదీష్, వేలూరు

ఈవో : సామాన్య భక్తులకు దర్శనం కల్పించడంతో పాటు స్వామివారి నైవేద్యం ఆలస్యం కాకుండా ఉండేందుకే శుక్రవారం రోజు జారీ చేసే నిజపాద దర్శనం సేవా టికెట్లను టీటీడీ బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,310
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,566

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,200
రిటైల్ వెండి గ్రాము	రూ.78.20

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్ట్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో అక్రమంగా ఇంట్లోనే మద్యం అమ్ముతున్న ఒకరిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. ఆయన కథనం.. రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఇందులో 34 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు.

నడకతో ఆరోగ్యం



వాక్‌థాన్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరితోపాటు పలువురు వైద్య విభాగానికి చెందిన సిబ్బంది

తిరుపతి అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి 2కె వాక్‌థాన్‌ను చేపట్టినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి తెలిపారు. ఆయన శుక్రవారం ఉదయం కలెక్టరేట్ నుంచి ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి వరకు వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టారు. మందులు పంపిణీ చేశారు. వాక్‌థాన్‌లో పాల్గొన్న వారికి సేవలు అందించడం సంతోషంగా ఉందని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని వెల్లడించారు.

మీతో ఉంటా..మీలో ఒక్కడిగా ఉంటా!

- ఎమ్మెల్యే అభ్యర్థిగా అవగాశం వచ్చింది
- పెద్ద మనసుతో ఆశీర్వదించండి
- మహాపాదయాత్రలో మోహిత్‌రెడ్డి



ఉస్తికాయలపెంట గ్రామ సమీపంలో వేరుశనగ పంట దిగుబడిని పరిశీలిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట: ‘‘మీలో ఒక్కడిగా.. మీతోనే ఉంటా. మీ బిడ్డగా మీ ముందుకు వచ్చా. ఆశీర్వదించండి.. 2024లో ఎమ్మెల్యేగా గెలిపించండి’’ అని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభ్యర్థించారు. ఎర్రావారిపాళెం మండలం, ఉస్తికాయలపెంట పంచాయతీలో శుక్రవారం ఉదయం ఆయన మహాపాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో భాగంగా గ్రామసమీపంలో వేరుశనగ నూర్పిడి పనుల్లో నిగమ్నమైన రైతులు, రైతు కూలీలతో మాట్లాడారు. ఈ సారి పంట దిగుబడి పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. దళారులతో నష్టపోకుండా రైతుభరోసా కేంద్రాల ద్వారా వేరుశనగ కాయలు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. పింఛను అందుతుందా.. వలంటీర్ ఇంటికొచ్చి ఇస్తున్నారా..? అంటూ అడిగి తెలుసుకున్నారు. తుడా నిధులు రూ.1.98 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. సచివాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

కారు, లారీ ఢీ



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ కోటీశ్వరావు



నుజ్జునుజ్జు అయిన కారు

శ్రీకాళహస్తి రూరల్: కారు–లారీ ఢీకొని ఒకరు మృతి చెందగా మరో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం.. తెలంగాణ రాష్ట్రం, భద్రాది కొత్తగూడెం జిల్లా, అశ్వపురం గ్రామానికి చెందిన కొప్పాల శ్రీనివాసరావు కుటుంబం తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరింది. శ్రీకాళహస్తి మండలంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి చెర్లోపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న కోటీశ్వరరావు(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరావు(47), నాగమణి(37), యామిని(17), ధనుష్(19), విష్ణు(14) పెద్ది తరుణ్(20)కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నగరి : మండలంలోని డీవీఆర్ కండ్రిగ వద్ద శుక్రవారం విద్యుదాఘాతానికి గుర్రై రవీందర్ (22) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, వులవనూరు మండలం, బంజారా గ్రామానికి చెందిన రవీందర్ విద్యుత్ సబ్ కాంట్రాక్టు పనుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో 11 కేవీ లైన్ ఆఫ్ చేసి ఉందనుకుని విద్యుత్ పనులు చేయబోగా షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. వీఆర్‌ఓ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అన్నదాతకు అండగా ‘అగ్రి ల్యాబ్’

- పక్కా పరీక్షలతో నకిలీ విత్తనాలు.. ఎరువులకు చెక్
- నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులే లక్ష్యం
- జిల్లాలో ఆరు చోట్ల డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- నగరిలో ఇప్పటికే ప్రారంభం.. వివిధ దశల్లో మిగిలినవి

నకిలీ విత్తనాలు.. ఎరువులు.. ఆరుగాలం కష్టించే అన్నదాతను నిలువునా ముంచేస్తాయి. వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేస్తే అప్పుల ఊబిలోకి నెట్టేస్తాయి. ఆశించిన దిగుబడి సంగతి దేముదెరుగు.. అసలుకే ఎసరు తెచ్చేస్తాయి. ఇలా రైతులను దగా చేస్తున్న నకి‘లీలల’కు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. విత్తనాలు.. ఎరువుల.. పురుగుమందులను పక్కాగా పరీక్ష చేయిస్తోంది. తద్వారా కర్షకుడు నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించేందుకు పూర్తి సహకారం అందిస్తోంది. ఈ మేరకు వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందడుగు వేస్తోంది.

నగరి : రాయలసీమ పరిధిలో 48 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో జిల్లాకు 6 ల్యాబ్‌లు కేటాయించింది. వీటిలో ముందుగా నగరిలో 2021, జూలైలోనే ప్రప్రథమంగా తొలి ల్యాబ్ ప్రారంభమైంది. పలమనేరులో నిర్మించిన అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. చిత్తూరులోని జిల్లా అగ్రిల్యాబ్ నిర్మాణం తుదిదశలో ఉంది. అలాగే పెనుమూరు, సోమలలో సైతం రెండు ల్యాబ్‌లు నిర్మాణంలో ఉన్నాయి. కుప్పం, తవణంపల్లెలో స్థల సేకరణ, టెండర్ల ప్రక్రియ జరుగుతోంది.

నాణ్యతకు పరీక్ష

రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల నాణ్యతపై సందేహాలు వస్తే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షల చేయించుకోవచ్చు. నాణ్యమైనవి అని నిర్ధారించుకున్న తర్వాతే వినియోగించుకోవచ్చు. గతంలో ఇలాంటి పరీక్షకు తాడేపల్లిగూడెం, హైదరాబాద్‌లోని ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. అప్పట్లో టెస్ట్ రిపోర్టు రైతుకు అందేసరికి కనీసం నెలకు పైగా పట్టేది. ప్రస్తుతం ఏర్పాటైన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో రెండు నుంచి మూడు రోజుల్లోపే ఎరువులకు సంబంధించిన రిపోర్టు, వారం నుంచి పది రోజుల్లోపు విత్తనాల నివేదికలు అందిస్తున్నారు. వీటి కోసం ఒక్కో టెస్టింగ్ ల్యాబ్‌లో ముగ్గురు అనలిస్టులు, ఒక ఏఓ, పర్యవేక్షణకు ఏడీఏ నియమించారు.

ఇప్పటివరకు 359 పరీక్షలు

నగరిలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఇప్పటివరకు 359 పరీక్షలు చేశారు.



నగరిలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



విత్తనాలు పరిశోధిస్తున్న అనలిస్ట్

వీటిలో విత్తనాల నాణ్యతకు సంబంధించి యాక్ట్ శాంపిల్స్ 186 పరీక్షించగా వాటిలో 2 నాణ్యతలేనివని గుర్తించారు. రైతులు తెచ్చిన శాంపిల్స్ 32 పరీక్షించగా వాటిలో 4 నాణ్యత లేనివని గుర్తించారు. ట్రేడ్ శాంపిల్స్ 7 పరీక్షించగా అవి అన్నీ నాణ్యమైనవిగా తేల్చారు. ఎరువులకు సంబంధించి 117 యాక్ట్ శాంపిల్స్, రైతులు తెచ్చిన 12 శాంపిల్స్, ట్రేడ్ శాంపిల్స్ 5 పరీక్షించగా అన్నీ సరిగా ఉన్నట్లు నిర్ధారించారు.

పకడ్బందీగా విత్తనాలు, ఎరువుల టెస్టింగ్

ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధిత పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వీటిని సేకరించే అధికారులు వాటిని పరీక్షలకు ఎక్కడకు పంపిస్తారో ఎవ్వరికీ తెలియని విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. యాక్ట్ శాంపిల్స్ కింద ఇతర జిల్లాల్లోని టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపి వాటి నాణ్యతను తెలుసుకుంటున్నారు. పరీక్షించే వారికి కూడా అవి ఎక్కడి నుంచి వచ్చాయన్న వివరాలు తెలియకుండా చర్యలు చేపడుతున్నారు.

విత్తన, ఎరువుల పరీక్ష ఇలా..


టెస్టింగ్ ల్యాబ్‌కు వచ్చే విత్తనాలను తొలుత సీడ్ బ్లోయర్ ద్వారా దుమ్ముధూళి లేకుండా శుభ్రపరుస్తారు. సీడ్ డివైడర్ ద్వారా వాటిని మిక్స్‌చేసి రెండు భాగాలుగా విభజించుకుంటారు. వాటిని మైక్రోస్కోపిక్ లెన్స్‌లో పరిశీలించి అందులోని పుచ్చులను తొలగించి మిగిలిన వాటిని తీసుకుంటారు. వాటిని సమాన భాగాలుగా విభజించి వాటిని తడిపి జెర్మినేషన్ పేపర్లలో చుట్టి ఆ నాలుగు చుట్టలను సీడ్ జెర్మినేటర్‌లో ఉంచుతారు. నిర్దేశిత రోజులు అనంతరం వాటిని బయటకు తీసి ఒక్కో చుట్టలో ఎన్ని విత్తనాలు మొలకెత్తాయో పరిశీలించి వాటి నాణ్యతను గుర్తిస్తారు. అలాగే ఎరువుల్లో యూరియా, పాస్పరస్, పొటాషియం, కాల్షియం, నైట్రోజన్ ఫెర్టిలైజర్ అంటూ రకాలను అనుసరించి వాటిని రసాయనాలలో కలపి హాట్ ఎయిర్ ఓవెన్‌లో ఏకరీతి ఉష్ణోగ్రతలో ఉంచుతారు. అనంతరం మఫల్ ఫర్నేస్‌లో మండించి బూడిద చేసి రసాయన ద్రావణాలలో కలపడం ద్వారా ఎరువులు నాణ్యమైనవో.. కాదో తేలుస్తారు.

త్వరితగతిన నివేదిక



విత్తన నాణ్యతను పరిశీలించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో ఉంది. వారం నుంచి పది రోజుల్లోపే విత్తన నాణ్యతపై నివేదిక అందిస్తున్నాం. నాణ్యతను పరిశీలించుకొని సాగు చేసుకుంటే పంట బాగా పండుతుంది.
– జలంధర్, సీడ్ అనలిస్ట్, వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్, నగరి.

పరీక్షించి తెలుస్తాం



ఎరువులు మంచివో, నకిలీవో రసాయనిక పద్ధతుల ద్వారా పరీక్షించి తెలుస్తాం. రైతులకు ఎరువుల నాణ్యతపై ఎలాంటి సందేహాలు వచ్చినా వాటిని పరిశీలించుకోవచ్చు. నకిలీ ఎరువులు వినియోగించి నష్టపోవాల్సిన అవసరం లేదు.
– సెందామరం, ఫెర్టిలైజర్ అనలిస్ట్, వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్, నగరి.

పంట ఏపుగా ఉంది



వేరుశనగ విత్తనాలను అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షించుకున్నా. వారు పది రోజుల్లో విత్తనాలు బాగున్నాయని, వాడుకోవచ్చని నివేదిక ఇచ్చారు. ఆ విత్తనాలతోనే పంట సాగుచేశా. పంట ఏపుగా పెరిగింది. దిగుబడి బాగా వస్తుందన్న నమ్మకం ఉంది.
– శివలింగం రెడ్డి, రైతు, నింద్ర